

–'గిరీశం'

వృత్తి గౌరవాన్ని చెడగొడుతున్నామన్నట్టు అభిప్రాయపడుతున్నట్టు అతని ముఖంలో కనిపిస్తున్న లక్షణాల ద్వారా నా కనిపించింది.

'అయ్యో, పాపం, నీ కిదేం ఖర్మ' అన్నట్టు ప్రకాష్ కుమార్ జాలిగా నా మొహంలోకి చూశాడు. నేను వీటన్నింటికి అలవాటు పడిపోయినట్టు, అతీతుడనయినట్టు ఏమాత్రం చలించకుండా రాయిలా ఉండగలిగాను.

ప్రకాష్ కుమార్ సడెన్‌గా ఏదో గుర్తుకి వచ్చినట్టు, "పుల్లయ్యగారూ, కాస్త స్కూటర్ డిక్కీ తెరిచి అందులో ఉన్న ఎగ్రిమెంట్ కాగితాలు పట్టండి. కొన్ని ముఖ్యమైన క్లాజులు చూడాలి, అర్జెంటు" అని అడిగీ అడగకముందే గంగిరెద్దులా తల ఊపి స్కూటర్ తాళం చెవులు తీసుకుని పుల్లయ్య అక్కడి నుండి నిష్క్రమించాడు. ప్రకాష్‌కుమార్ తన కుర్చీని నాకు దగ్గిరగా జరిపి, రహస్యం అడుగుతున్న ధోరణిలో "నిజంగానేనా?" అని అడిగాడు.

నేను అవునన్నట్టు తల ఊపి, అతను మరో ప్రశ్న వేయకుండానే నేనే అడిగాను: "ప్రస్తుతం తమరేం చేస్తున్నట్టు?"

ప్రకాష్ కుమార్ తృప్తిగా నిట్టూర్చి, "మునిసిపల్ కార్పొరేషన్‌లో జె. ఇ." అని జవాబిచ్చాడు. షాక్ తగిలినట్టయింది. 'ఆనర్స్ ఫస్ట్ క్లాసులో పాసయిన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా రోడ్డుమీదికి గెంటేసిన ప్రభుత్వం పాసు మార్కులతో బయటపడ్డ ప్రకాష్ కుమార్‌కి ఉద్యోగ మెలా ఇచ్చిందని?' నా సందేహం సందేహ రూపంలో ఉండగానే అంతరాత్మ ఘోషించింది—'ఓయ్, వెర్రివాడా! అతను ఎవరో నీకు తెలీదా?' అని. నోరు మూసుకు కూర్చున్నాను. పైకిమాత్రం "కంగ్రాట్స్, పనెక్కడ—ఈ స్కూటర్ నీదేనా?" అన్నాను, తళతళ మెరిసిపోయే ఆ స్కూటర్ పక్కన మా నాన్నగారితోపాటు రిటైరై ఇంకా జీవిత చరమ దశలో నాకు సేవలు చేస్తున్న మా డొక్కు సైకిల్‌ని ఊహించుకుని పోల్చుకుంటూ.

"నేను వంతెన నుండి పిచ్చి ఆస్పత్రి దాకా ఉన్న ఎనిమిది మైళ్ల కంకర రోడ్డును సిమెంటు చేసే పనికి ఇన్‌ఛార్జిగా ఉన్నాను. ఈ పోస్టింగ్ కూడా నేను మేనేజి చేసిందే" ... అప్పటికి వెయిటర్ మహానుభావుడు వేంచేశాడు.

"ఏమిటోయ్, ఇంత త్వరగా వచ్చేవు! ఆ మధ్య ఎవరో అన్నట్టు నువ్వుకాదు వెయిటర్‌వి, మేము ... ఇప్పటికైనా కాస్త త్వరగా తెమిలి, మూడు బాసుందీలు, మూడు మస్కా మసాలాదోసెలు, మూడు స్పెషల్ కాఫీలు" అని ప్రకాష్ కుమార్ ఏక బిగిన చెప్పుకుపోయి, వెయిటర్ వెళ్లిపోబోతూండగా, "ఇదిగో. అన్నీ ఒకేసారి తెచ్చేవు. ఒకదాని తరవాత మరోటి" అని తన విట్టుకి తానే నవ్వుకున్నాడు.

"ఎందుకోయ్, ఇప్పు డివన్నీ" అంటున్న నా మాటలను తేలిగ్గా కొట్టిపారేస్తూ, "పోనిద్దూ, ఈమాత్రం లేనిదే ఏం మజా వస్తుంది?" అని, "ఆఁ. స్కూటర్ సంగతి అడిగావుకదూ? ఆ బండి అక్షరాలా నాదే. ఈ మధ్యనే బ్లాక్‌లో అయిదువేలకు కొన్నాం" అని ఒక్కక్షణం నా వైపు చూశాడు, బహుశా నా నుంచి ఆశ్చర్యార్థకమైన ఎక్స్‌ప్రెషన్ వస్తుందేమో అని. అలాంటి దేమీ రాకపోయేసరికి, తిరిగి తానే ప్రారంభించాడు: "ఈ సెక్షన్‌కి పోస్టింగ్ చేయించుకున్న మరుసటి రోజే మళ్ళెల పుల్లయ్య అన్న ఈ జంతువు మా ఇంటికి వచ్చి, 'సార్, నేనే ఈ పనికి కంట్రాక్టర్ని' అంటూ పళ్ళికిలించాడు. అప్పు డతనికి కాఫీ ఇచ్చి, సూపర్‌వైజర్, కంట్రాక్టర్ మధ్య ఎటువంటి సంబంధా లుండాలో అరగంట సేపు లెక్చరిచ్చి, చిట్టచివరికి 'నాకు కన్వేయన్స్ లేక చాలా కష్టపడి పోతున్నానోయ్' అన్న ఒక్క ముక్క విసిరేను. అసాధ్యుడు...వారం తిరిగేసరికల్లా రిజిస్ట్రేషన్ సర్టిఫికేటుతో సహా బండిని నా ముందు హాజరుంచాడీ పుల్లయ్య."

ఈ సారి వీడి తెగింపుకు నిజంగానే బోలెడు ఆశ్చర్యం కలిగింది. "ఇదేం పనిరా?" అన్నాను విస్మయాన్ని ప్రకటిస్తూ.

"ఓస్ — ఈ వ్యాపారంలో ఇది మామూలే. రేపు నువ్వు ఇలాంటి వెన్నో చేయవలసి ఉంటుంది. అయినా వాడి బాబు సొమ్మేమైనా నాకు తేరగా ధారపోస్తున్నాడా? — అంతకు పదింతలు లాభం పడతాడు. వాడుమాత్రం ఊరుకుంటా డేమిటి, రేపు నా పెర్సంటేజిలో తెగ్గోసుకుంటాడు."

"పెర్సంటేజా?"

"ఏమిటోయ్, మరీ ఆఫ్రికానుంచి వచ్చినట్టు మాట్లాడుతావ్! ఈ వృత్తిలో ఓనమాలు తెలీకుండానే ఎందుకు దిగావోయ్? రియల్లీ ఐ పిటీ యూ—పూర్ క్రీచర్. చూడు, మెయింటెయినెన్స్ పనికి అయిదు, కొత్త నిర్మాణ మైతే మూడు, ఇది సూపర్‌వైజర్ వంతు, రెండు ఎ. ఇ. గారికి, ఒకటి ఇ. ఇ. గారికి. ఆ పైన అక్కౌంటెంట్, హెచ్. డి., బిల్‌క్లార్కు, కాషియర్, ప్యూన్లు వగైరా వాళ్ళందరికి మరో కొంత..." ప్రకాష్ కుమార్ మరి కొన్ని లెక్కలు చెప్పి నా గుండెలు బేజారెత్తించే లోపున వెయిటర్ బాసుందీ ప్లేట్లతోను, పుల్లయ్య స్కూటర్ తాళం చెవులతోను ప్రత్యక్షమయ్యారు.

"డిక్కీ అంతా వెతికాను, సార్. ఏ కాగితాలు లేవు" అని మొహం మాడ్చుకున్నాడు పుల్లయ్య.

ప్రకాష్‌కుమార్ ఆశ్చర్యం నటిస్తూ, "లేవూ ... ఓ...సారీ ... సెక్షనాఫీసులోనే మరిచిపోయి వచ్చి ఉంటాను... ఫర్వాలేదు లెండి... అయినా మీ రింత ఆలస్యం చేశారేం?" అన్నాడు.

"నేను హోటలుకు – తిరిగి వచ్చేస్తుంటే, కిళ్లీ షాపు వద్ద మా పాత స్నేహితు డొకడు కనిపించాడండి. ఏవో కబుర్లు."

"అతనూ కంట్రాక్టరేనా?" అడిగాడు ప్రకాష్ కుమార్.

"ఏం జోకులు వేస్తారు, సార్, మీరు! ఇక మా కంట్రాక్టర్లకి వేరే మనుషులతో స్నేహ ముండదనా తమ అభిప్రాయం? మేమూ మనుషులమే, సార్."

"ఆఁ ఆఁ. ఆ విషయం చెప్పకుండానే తెలుస్తుందిగా, కానివ్వండి" అంటూ తాను బాసుందీ ప్లేట్ పైన దాడి ఆరంభించాడు. మళ్లెల పుల్లయ్య మధ్య మధ్య నన్ను తన వాడిచూపులకు బలి చేస్తూ బాసుందీ జుర్రేస్తున్నాడు. నా చేతులు పని కానిచ్చేస్తున్నా మనస్సు మరో దిశ పయనిస్తూంది. కొత్త కొత్త సందేహాలు, భయాలు.

వెయిటర్ మసాలా దోసె తెచ్చాడు.

"ఇంతకీ ఏదైనా పని తీసుకున్నావా లేదా?" నన్నుద్దేశించి అడిగాడు ప్రకాష్ కుమార్. నా సమాధానంకోసం పుల్లయ్య కూడా కాస్త ఇంటరెస్ట్ చూపిస్తూ దోసె తినడం ఆపి నన్ను చూశాడు.

"ఆఁ. ఏదీ, నిన్ననే టెండర్ ఫారాలు కొన్నాను."

"పనేమిటి?"


"'—' హాస్పిటల్ బిల్డింగ్‌కి ఏవో కొన్ని ఎడిషన్స్, ఆల్టరేషన్స్."

"పని మొత్తం ఎంతండి?" సీనియరైన కంట్రాక్టర్ వేసిన ప్రశ్న అది.

"పాతిక వేలుంటుంది."

పెదవి విరిచాడు పుల్లయ్య. ప్రకాష్ కుమార్ కూడా పుల్లయ్య అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించాడు. నా వైపు తిరిగి 'పాతిక వేలలో డిపార్ట్‌మెంట్ వాళ్ళ సిమెంటు, ఇనుము ఇవ్వగా కోసుకున్నది పోను నీకు మిగిలేదేమిటోయ్? అందులో నీ ఖర్చులు తీసివేస్తే ఎంత లాభం వస్తుందేమిటి?"

నేను జవాబు చెప్పలేదు. నేను జవాబు చెప్పకపోవడం పుల్లయ్య కేమాత్రం రుచించినట్టు లేదు. వెయిటర్ తన రాక ఆలస్యమయినందుకు టైమును కాంపెన్సేట్ చేస్తున్నట్టు కాఫీ కూడా వెన్వెంటనే తెచ్చాడు. కాఫీ త్రాగుతూ ప్రకాష్ కుమార్ ఆటంబాంబు లాంటి ప్రశ్న వేశాడు. ప్రశ్న మామూలే. కానీ అది నాకు ఎంతో భయంకరంగా తోచింది. ప్రకాష్ వేసిన ప్రశ్న "'షెడ్యూల్ ఆఫ్ రేట్స్' అన్న పుస్తకాన్ని నేను సంపాదించేనా లేదా?" అన్నది. నేను కొంత కాలం డిపార్ట్‌మెంటులో పనిచేసిన వాణ్ణి కాబట్టి, నాకు తెలిసిందల్లా ఆ పుస్తకం కేవలం డిపార్ట్‌మెంటు వ్యక్తులు వాడుకోవటం కోసమనీ, అది బయటి వాళ్ళు, ముఖ్యంగా కంట్రాక్టర్ల కళ్లబడకూడదనీనూ. అందుకే ఈ ప్రశ్న నాకు భయం కలిగించేదిగా తోచింది.




"అందరికీ అర్థం అయ్యేటట్టు మోడర్న్‌గా వ్రాయమన్నారు గదండి..."


ఇదే అభిప్రాయాన్ని నా ముఖ భంగిమల ద్వారా తెలియజేస్తూ "ఇది సీక్రెట్ కదూ?" అని మాత్రం అన్నాను. ఈసారి ప్రకాష్ కుమార్‌కు విసుగు, కోపం కలిగినట్టున్నాయి.

"ఏమిటోయ్, మరీ బడుద్ధాయిలా మాట్లాడుతావు? గవర్నమెంటు వారి రేట్లు తెలీకుండానే నువ్వు టెండర్ ఫారా లెలా నింపుతావోయ్? ఇక సీక్రెట్ సంగతంటావా — అసలు ప్రభుత్వంలో సీక్రెట్ అనుకున్న ప్రతి కాగితం చేరవలసిన వాళ్ల వద్దకు అతి శీఘ్రంగా చేరుతుంది. షెడ్యూల్ ఆఫ్ రేట్స్ పుస్తకం లేని కంట్రాక్టరెవ రుంటారోయ్— ఒకటి గాదు, నాలుగైదు కాపీలుంటాయి, ఒక్కొక్కరి దగ్గిర. కావాలంటే పుల్లయ్యగారి నడుగు" అని పుల్లయ్య వైపు చూశాడు. పుల్లయ్య సమాధానంగా చిరునవ్వు వెలిగించాడు.

ప్రకాష్ కుమార్ అడిగిన ప్రతి మాట నా గుండెలో సూదిలా గుచ్చుకుంది. అ, ఆ లు రాని నేను ఈ వృత్తిలో దిగానని కాదు. ప్రభుత్వానికి ప్రతినిధి అయిన ప్రకాష్ కుమార్ గీతాచార్యుడిలా ఇంజినీరింగ్ ప్రొఫెషన్‌కు సంబంధించిన రహస్యాలు బట్టబయలుచేసి, ఇవన్నీ మామూలే అన్నంత తేలికయిన భావంతో మాట్లాడుతూంటే, ఒకవైపు ఆశ్చర్యమూ, మరో వైపు అసహ్యమూ కలిగాయి. వెంటనే ఈ వృత్తికి ఉద్వాసన పలికి ఏ పుస్తకాల షాపో పెట్టుకుందామన్న పిచ్చి ఆవేశం కలిగింది. వెయిటర్ బిల్లు తెచ్చాడు. బిల్లుపై చేయి వేయబోతున్న నన్ను మొరటుగా వారించి, అధికారయుతంగా బిల్లును పుల్లయ్య వైపు నెట్టాడు. మామూలు ఏదిగా దాన్ని స్వీకరించి పుల్లయ్య కౌంటర్‌వైపు నడిచాడు. ప్రకాష్ కుమార్ సీట్లోంచి లేచి "అల్రైట్, బోయ్. విష్ యూ బెస్టాఫ్ లక్ — మళ్లీ కలిసిస్తాను" అంటూ పెద్ద పెద్ద అంగలేస్తూ స్కూటర్ వైపు నడిచాడు. వాళ్లు వెళ్లిపోయి ఎంతోసేపయినప్పటికీ, నా మనస్సు, దృష్టి అటువేపే కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రకాష్ కుమార్ చెప్పిన మాటల ధోరణి చూస్తే నేనెందుకూ పనికిరాని వాజమ్మనేనా? అనిపించింది. ఎంతో కష్టపడి, ఎప్పటికప్పుడు నన్ను నేను వెన్ను తట్టుకుంటూ, ఆశని. ఉత్సాహాన్ని నింపుకుంటూ, ఏదో ఒక రోజు నా నీతికి, నిజాయితీకి గుర్తింపు వచ్చి నాకు రావలసిన గౌరవం [illegible] వస్తుందని, ఎక్కవలసిన మెట్టు ఎక్కగలుగుతానని, అప్పుడు నేను పొందే సంతృప్తి, క్షుద్రమైన ఈ నీతిమాలిన ధనార్జనతో వచ్చే తాత్కాలికమైన సంతోషానికీ-తేడా వందలు, వేలు రెట్లుంటుందని ఆశిస్తూ వచ్చిన నాకు అడుగడుగున అపజయం, అపహాస్యం ఎదుర్కొని నా మనస్సుని చిన్నాభిన్నం చేస్తుంటే, నన్ను నేను అటు ఆత్మవంచన చేసుకోలేక, ఇటు క్రుంగదీస్తున్న నిరాశా నిస్పృహలను పారద్రోలలేక సతమతమయిపోతూ, చైతన్య రహితంగా, కేవలం మరమనిషిలా కొంపకి చేరాను.

కళాకాంతులు లేని నా మొహం చూసి హైరానా పడిపోయి, ఎందుకిలా ఉన్నారని అడుగుదామనుకుని, తన ప్రశ్నని బలవంతాన అణచుకుని, ఆ సమయంలో నాకు దైహికమైన విశ్రాంతి కావాలనుకుని కాబోలు ఊరుకుంది శ్రీమతి. ఆ రాత్రి చాలాసేపటిదాకా నాకు నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలు...పీడకలలు. తెల్లవారుఝామున రెండు మూడు గంటలసేపు అలసిన నా కనురెప్పలపై నిద్రాదేవత జాలిగొన్న ఫలితంగా మనస్సుకు, శరీరానికి కొంత విశ్రాంతి ఏర్పడింది. ఉదయం జరిగిన దాన్ని మెదడులోని ఏ పొరలోనో మాయం చేసి, దూదిపింజలాంటి తేలికైన మనస్సుతో దైనందిన కార్యక్రమాలారంభించాను.

టెండర్ ఫారమ్‌తో డిపాజిట్టు చేయాల్సిన ఎర్నెస్ట్ మనీ బాంక్‌లో చెల్లించి చలాన్ పుచ్చుకుని ఇంటికి వచ్చేశాను. రాగానే శ్రీమతి "మీకోసం ఎవరో రెండు మార్లు వచ్చి మళ్లీ అరగంటలో వస్తానని చెప్పి వెళ్లారు" అంది. 'ఎవరై ఉంటారా?' అని కాసేపు ఆలోచించేను. ప్రకాష్‌కుమారేమో అనిపించింది. కాని వెనువెంటనే అతనికి నా ఇంటి అడ్రెస్ తెలీదుకదా అనికూడా అనిపించి, 'సరే, ఎవరైతేనేం, అరగంటలో వస్తామన్నారు కదా!' అని మనస్సును అటువేపునుండి తిప్పి, కొన్ని చిత్తు కాగితాలు ముందువేసుకుని ఒక్కొక్క అయిటముకు కావలసిన వస్తువులు, ధరలు, పనిచేయడానికి అవసరమయిన మనుషులు, వాళ్ల రేట్లు లెక్కలు వేసి వచ్చిన మొత్తానికి పది శాతం నా లాభం వేసుకుని రేట్లు కట్టనారంభించాను. అలా ముప్పావు గంటసేపు కొట్టుకుంటే తీరా అయింది రెండు అయిటములకు రేట్లువేయడం మాత్రమే. ఈ లెక్కన మొత్తం టెండర్ ఫారమ్‌లోని అయిటములకు లెక్కలు వెయ్యాలంటే, నాకున్న టైము సరిపోదేమో అనిపించింది. 'అయినా కొత్తకదా. అలవాటయితే ముున్ముందు అనుభవం మీద గంటలలో ఇప్పు డయ్యే పనిని నిమిషాల మీద లాగెయ్యొచ్చు' అని మనస్సుకు సర్ది చెప్పుకుని తిరిగి పనిలో పడ్డాను.



కీర్తిశేషులు
శ్రీ మొసలికంటి తిరుమలరావుగారు

తలుపు తట్టడం, శ్రీమతి వచ్చి తలుపు తీసి "ఉన్నారు, రండి" అని ఆహ్వానించడం, నడివయస్సులో ఉన్న ఒక 'నల్లని రంగు పూసుకున్నాడా' అని చూసి చూడగానే అనిపించే ఒక వ్యక్తి రావడం జరిగింది. ఆగంతుకుడు నమస్కరించాడు. ప్రతిగా నేను నమస్కరించి కూర్చోమని నా ఎదట నున్న కుర్చీ చూపించాను.

కూర్చుంటూ, నా టేబిల్ పైన ఉన్న చిత్తు కాగితాలపై చేస్తున్న హోమ్ వర్క్ చూసి అతను కిసుక్కున నవ్వాడు.

"టెండర్ కోసమేనా ఈ కసరత్తంతా?"

మాటా మంచీ లేని అతని నవ్వు, ప్రశ్న నాకు మనస్సు చివుక్కు మనిపించేలా చేశాయి. తగు రీతిగా జవాబిద్దామనుకున్నాను గాని ఇంటికి వచ్చిన పెద్ద మనిషిని మర్యాద చేయకపోవడం భావ్యంగా ఉండదని తమాయించుకున్నాను.

"అవునండి" అన్నాను పొడిగా.

"నా పేరు రింగు ముత్తయ్య."

"నా పేరు విశ్వనాథం" అన్నాను.

ముత్తయ్య భళ్లున నవ్వాడు.

"మీ పేరు తెలియకుండానే మీ ఇంటి కొచ్చా ననుకుంటున్నారా?" అని రెండు క్షణాలు ఆగి, "నేరుగా వ్యవహారంలోకి వస్తాను" అన్నాడు.

వేసుకున్న మాసిపోయిన గళ్ల కోటు జేబులోంచి బీడీల కట్ట తీసి, అందులోంచి ఓ బీడీ లాగి పళ్ల మధ్య ఇరికించి, మరో జేబులోంచి అగ్గిపెట్టె తీశాడు. ఈలోగా శ్రీమతి కాఫీలు తెచ్చి టేబిల్‌పైన ఉంచింది.

"ఎందుకండీ మీకీ శ్రమ" అని లాంఛనంగా అనేసి, బీడీ వెలిగించకుండా నోట్లోంచి తీసి చెవిపైన పెట్టి కాఫీని గడగడ తాగేశాడు. అతని ధోరణిని వచ్చినప్పటినుండి ఓ కంట కనిపెడుతున్న శ్రీమతికి ఆశ్చర్యమూ, కొంత అసహ్యమూ కలిగి నా వైపు చూసింది. 'నీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను' అన్నట్లుగా నా చూపులతో జవాబిచ్చాను.

ముత్తయ్య తాగిన కాఫీ కప్పు తీసుకుని. శ్రీమతి వంటింట్లోకి వెళ్లింది.

నేను కాఫీ తాగుతుంటే, ముత్తయ్య బీడీ వెలిగించాడు.

గొంతు సవరించుకొని, "ఈ పని మీకు కొత్తనుకుంటాను" అన్నాడు.

అప్పటిదాకా అతను వచ్చిన పనేమిటో అర్థంకాక చస్తున్న నాకు అసలు సంగతి చెప్పకుండా డొంకతిరుగుడు ప్రశ్న లడుగుతుంటే ఒళ్లు మండిపోయింది. ఇకముందు కూడా ఇలాంటి ప్రశ్నలే వేస్తే అవసరమయితే సమాధానాలు కటువుగానే ఇద్దా మనుకున్నాను.

"కంట్రాక్టులకు కొత్త. అందులో ఈ పని మొట్టమొదటిది" అన్నాను ముక్తసరిగా.

"ప్చ్ ... ప్చ్." పెదవి విరిచాడు ముత్తయ్య. మళ్లీ తానే "మీరెవరితోనైనా పార్ట్‌నర్‌షిప్ కలిశారా?" అని అడిగాడు.

'ఓహో... ఇదా సంగతి! తాను నాకు పార్ట్‌నర్‌గా ఉందా మనుకుంటున్నాడేమో, ఇదేమీ లాభం లేదు' అని మనస్సులో చెప్పుకుని, పైకి "అబ్బే, ఎవరితోనూ లేదండి. అందులో ఇలాంటివి నాకు నచ్చవు" అన్నాను.

"అర్రే — ఏమాత్రం అనుభవం

నేనేమీ చెప్పనక్కర లేకుండానే వంటింట్లోంచి మా మధ్య జరిగిన తతంగమంతా విన్నట్టుంది శ్రీమతి, మౌనంగా ఊరుకుంది. నేను చేసిన పని మంచో, చెడో తెలియక, నన్ను అభినందించాలో, తెగడాలో తెలియని పరిస్థితుల్లో ఉంది శ్రీమతి. విచిత్రం. అంతకుముందు నా మనస్సులో నాటుకున్న ఆశయాలు, ఆదర్శాలు ఎటు మాయమయ్యాయో భగవంతునికే తెలియాలి!

అప్పుడప్పుడు నా చర్యను తప్పు పట్టేందుకు అంతరాత్మ చేస్తున్న ప్రయత్నాలను ఏదో ఒక వితండవాదంతో ఓడించి నోరు మూయించేవాణ్ణి. మరునటి రోజే మా మామగారికి నా ప్రయోజకత్వాన్ని తెలుపుకుంటూ జాబు రాశాను.

నెల రోజుల తరవాత అనుకుంటా, ఓ సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌లో నన్ను కంట్రాక్టర్ లిస్ట్‌లో వేయించిన మా మామగారి బాల్యమిత్రుడైన వృద్ధ అసిస్టెంట్ ఇంజినీర్‌గారు కనిపించారు. నమస్కరించాను. వారు నన్ను పోల్చుకుని, తనతో రమ్మన్నట్లుగా సైగ చేశారు. మంత్రించినట్టు వారి వెంట నడిచాను. కాస్త నిర్మానుష్యంగా, మాటుగా ఉన్నచోట వారు కూర్చొని నన్ను కూర్చోమన్నారు.

"మా డివిజన్‌లో మొన్న వచ్చిన కొత్త పని 'హాస్పిటల్‌లో, అడిషన్స్ అండ్ ఆల్టరేషన్స్'కి నువ్వు టెండర్ చేశావు కదూ?" అన్నారు తన పాత కళ్ల జోడులోంచి నన్ను తీక్ష్ణంగా పరికిస్తూ. గతుక్కుమన్నాను.

"అవునండి... కాని, పని రాలేదు" అన్నాను, గొంతును వీలైనంత తక్కువ స్థాయిలో దింపుతూ.

"ఆ రేట్లు, నువ్వు రాసినవేనా?" సూటిగా గుండెల్లోకి చొచ్చుకుపోయే బులెట్ లాంటి ప్రశ్న అది.

అవునందామనుకుని, తగు ధైర్యం లేక, మౌనం వహించాను.

"చూడు, మీ మామగారు నాకు చిన్ననాటి స్నేహితుడవటం మూలాన నీకు ఉపయోగించే నాలుగు ముక్కలు చెప్పే చనువు, అధికారం తీసుకుంటున్నాను. ఆ పనికి వేసిన మూడు టెండర్లలో నీ రేట్లు నూటికి ఎనభై శాతం హెచ్చు. ఆ రేట్లు చూడగానే అనుకున్నాను ఇది నీ పుర్రెలో పుట్టిన బుద్ధి కాదని." ఒక్కక్షణం చెప్పడం ఆపారు. పనికి మూడు టెండర్లు అనగానే తెల్లబోయాను. కళ్ల ఎదుట నిలిచిన చీకటితెరలు విచ్చుకుంటున్నట్టనిపించింది.

"నువ్వు రింగ్ ముత్తయ్యతో రింగ్‌లోకి దిగావు, అవునా?"

వారితో అబద్ధం చెప్పి నెగ్గరానివనుకుని అవునన్నట్టు తల ఊపేను.

"రింగ్ ముత్తయ్య ఇంటి పేరు 'రింగ్' కాదు. అతను 'రింగ్' చేయడంలో ఉద్దండ పిండం. అందుకే అతనికి రింగ్ ముత్తయ్య అన్న పేరు సార్థకమైంది. రింగ్ ఎంతటి పెద్ద విషయమో ఒక్కసారైనా ఆలోచించేవా? నీ రేట్లు 80 శాతం పెంచి, రెండో వాడిది 30 శాతం పెంచి, తనది మాత్రం పది శాతమే పెంచుకుని పని దక్కించుకున్నాడు. దీనివల్ల నిజంగా పనిచేసి వృద్ధిలోనికి రావలసిన నీలాంటి యువకునికో చక్కని అవకాశం పోయింది. తక్కువ రేట్లతో గట్టి పని జరిగే వీలు ప్రభుత్వం కోల్పోయింది. రింగ్ అన్నది ఒక అంటువ్యాధి. వ్యసనం. ఈ వ్యసనానికోసారి బానిసైన వాడు జన్మలో దీని పంజాలనుంచి తప్పించుకోలేడు. ఇక జన్మలో స్వంత పని తీసుకునేందుకు ఇష్టపడడు. పైగా, అవసరమైన ధైర్యమూ ఉండదు. ఓ టెండర్ ఫారమ్ కొనేయడం, ఎర్నెస్ట్ మనీ బ్యాంక్‌లో డిపాజిట్ చేయడం, అదెలాగూ తిరిగి వచ్చేదే కాబట్టి నిర్భయంగా చలాన్‌తో రింగ్‌లోకి రావడానికి అర్హత సంపాదించి బేరాల్లో దిగడం, వీలైనంత మొత్తం తేరగా పొందడం, ఈ చిన్న మొత్తాల కాశపడ్డవాడు పెద్ద కాంట్రాక్టులు చేయడం, ఎక్కువ డబ్బు సంపాదించడం అన్నవి ఏమాత్రం చేతకావు. స్వయంగా నీ చేతితో పనిచేసి, అందులో ఉండే సాధక బాధకాలనుభవించి, పని అయిపోగానే ఆకట్టడం ఎదట నువ్వు నిలుచున్నప్పుడు, 'ఇది నాపని' అని నీకు కలిగే తృప్తికూడా నువ్వు సంపాదించే డబ్బుతోపాటు అవసరమే. ఏ పనీ పాటా లేకుండా కేవలం ఈ రింగ్‌కోసం కాచుకుని కూచునేవాళ్లు మా డివిజన్‌లోనే డజన్‌కు పైగా ఉన్నారు, తెలుసా?"

నాలో పెంచుకున్న అజ్ఞానాన్ని, మౌఢ్యాన్ని నిష్కర్షగా బయటపెట్టి జ్ఞానదీప్తిని వెలిగిస్తున్న వారి కాళ్లమీద పడదామన్నంత ఉద్వేగం ఉప్పెనలా పొంగుకు వచ్చింది. కాని అటూ ఇటూ మనుషులు నడుస్తున్న చోట నా ఈ చర్య అందరికీ వింత గొల్పుతుందన్న భయం వేసి బలవంతాన అణుచుకున్నాను.


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

### 6-1-71 నుంచి చందా పెరుగుదల

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక విడి ప్రతి వెల జనవరి 6, 1971 నుంచి 45 పైసలు.*

ప్రచురణకు సంబంధించిన ఖర్చులు — ముఖ్యంగా న్యూస్‌ప్రింట్ ధర, పత్రిక పంపిణీకి సంబంధించిన ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినందువల్ల వెలను పెంచవలసి వచ్చింది.

మాకెంత ఇష్టం లేకపోయినా పాఠకులకు మేమిప్పుడు అందిస్తున్న విధంగా — 72 పేజీలు, త్రివర్ణ చిత్రాలు, చిత్రాలు, ఇన్ని రచనలు వగైరాలు – పత్రికను అందజేయడం కోసం హెచ్చించక తప్పలేదు.

వెల హెచ్చించవలసివచ్చినందుకు విచారిస్తున్నాము.

ఈ మార్చిన విడి ప్రతి వెల, చందా రేట్లు 1971 జనవరి 6 నుంచి అమలులోనికి వస్తాయి.

విడి ప్రతి వెల 45 పైసలు.

### చందా రేట్లు

| | స్థానికంగా | పోస్టు ద్వారా |
|---|---|---|
| మూడ్నెల్లకు | 5-85 | 7-15 |
| ఆరు నెలలకు | 11-70 | 14-30 |
| సాలుసరి | 23-40 | 28-60 |

*ఇంతకుముందే చెల్లించిన చందాలు పై విధంగా లెక్కకట్టడం జరుగుతుంది.*

మదరాసు
1-12-70

జనరల్ మానేజర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక


"నువ్వు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేటువి. ఇప్పుడిప్పుడే నిజమైన లోకంలోకి అడుగెట్టిన వాడివి. భవిష్యత్తును చక్కగా దిద్దుకుని, ముందు ముందు ఉజ్జ్వలంగా వెలగాలి నువ్వు. నీలో శక్తిసామర్థ్యాలున్నాయి. కాని వాటిని పెడమార్గాన పెట్టి వృథా చేయకు. రేపు నువ్వు లక్షలార్జించక పోవచ్చు. కాని శ్రమపడితే నలుగురిలో దర్జాగా గౌరవంగా తప్పక బ్రతకగలవు. ఈనాడే బిజినెస్‌లో లక్షలార్జించిన వాళ్లు అనుభవం మెట్లపైన సాము చేస్తూ, పరిస్థితుల తాకిడికి తట్టుకుంటూ అహోరాత్రాలు కష్టపడి సంపాదించినవాళ్లే. కీర్తి, డబ్బు సంపాదించి నువ్వూ వాళ్ల కోవలోకే రావాలని నా అభిమతం. ఇంత కచ్చితంగా చెప్పినందుకు మరోలా అనుకోవనుకుంటాను" అంటూ లేచి నిలబడ్డారు.

కట్టలు తెగి ప్రవహించబోతున్న కన్నీళ్లను ఆపుకోవాలన్న ప్రయత్నమేమీ చేయలేదు. వినమ్రుడనై, ముకుళిత హస్తాలతో, గద్గదస్వరంతో "మీ సలహా అక్షరాలా పాటిస్తాను, సార్" అన్నాను.

"విష్ యూ ఆల్ ది బెస్ట్" అని చిరునవ్వులు జల్లుతూ, నాలో వెలుగుని, ఆశని, ధైర్యాన్ని నింపి పట్టాలు తప్పబోతున్న నా బండిని సక్రమ మార్గంలో చేర్చి నన్ను ఆజన్మ ఋణగ్రస్తుణ్ణి చేసుకున్న ఆ మహనీయుని వైపు కృతజ్ఞతా పూర్వకంగా అలా ఎంతసేపు చూసేనో! ★